# కేంద్ర నిధులతోనే ఏపీ సమగ్రాభివృద్ధి..!

**నంద్యాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు.**

**-రెండేళ్లలో రూ.14 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు**

**-రాజధాని, పోలవరం నిర్మాణాలకు వేల కో జీవి జీవిట్ల రూపాయలు మంజూరు**

**-కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభకు పోటెత్తిన జనం**

**-స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలి**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 17:**
కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారం, భారీ నిధులతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రత్యేక అభివృద్ధి సాధ్యమవుతోందని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం నంద్యాల పట్టణంలోని 'టెక్కే మార్కెట్' ప్రాంగణంలో ఘనంగా విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సభకు జిల్లా వ్యాప్తంగా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు.
ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ.. గత రెండేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రగతికి అత్యంత ప్రాధాన్యతనిచ్చిందని కొనియాడారు. కేవలం రెండేళ్ల వ్యవధిలోనే రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు వచ్చాయని ఆయన వెల్లడించారు.

పోలవరం, రాజధానికి రికార్డు స్థాయి నిధులు
రాష్ట్ర సమగ్ర వికాసానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమపాళ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని మధు పేర్కొన్నారు. కేంద్రం అందించిన సహకారాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు:
రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిందని చెప్పారు.ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న విశాఖ రైల్వే జోన్‌ను మంజూరు చేసి, ఉత్తరాంధ్రతో పాటు యావత్ రాష్ట్ర ప్రగతికి కేంద్రం అండగా నిలిచిందన్నారు. గ్రామీణ, పట్టణ, నగరాల అభివృద్ధి కోసం కేంద్రం నుంచి వేల కోట్ల రూపాయలు నేరుగా స్థానిక సంస్థలకు అందుతున్నాయని వివరించారు.

**స్థానిక సమరంలో కూటమి విజయమే లక్ష్యం!**
రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను కూటమి పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అభిరుచి మధు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాధించడమే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో, సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.
కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతున్నాయి. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత పారదర్శక పాలన అందిస్తామని తెలిపారు.

**సభకు తరలివచ్చిన నేతలు, అధికారులు**
జనసంద్రంగా మారిన ఈ విజయోత్సవ సభకు జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రులు, శాసనసభ్యులు కూటమి పార్టీల ముఖ్య నేతలతో పాటు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతదితర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ప్రభుత్వ విజయాలను ప్రతిబింబించేలా సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రచార ప్రదర్శనలు, ఫ్లెక్సీలు సభకు వచ్చే వారికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## పేదల అభ్యున్నతి, సంక్షేమమే కోసం

# పాటుపడే ఏకైక పేరు శిల్పా

**- రూ. 10 వేల లోపు ఉండే వైఎస్సార్ కళ్యాణ మండపం అద్దె ఇప్పుడు రూ. లక్షలా.?**

**- కూటమి ప్రభుత్వంపై నంద్యాల ప్రజల ఆగ్రహం.. శిల్పా సేవా కార్యక్రమాలపై కక్షసాధింపా?**

**- మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి నిర్మించిన మండపాన్ని సామాన్యులకు దూరం చేశారంటూ ఆవేదన.**

**- పేద మహిళల అభ్యున్నతికి శిల్పా కుటుంబం కృషి.. సేవలను అడ్డుకోవడంపై ప్రజా నిరసన.**









**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 17:**
పేద ప్రజల శ్రేయస్సు కోసమే దశాబ్దాలుగా పనిచేస్తున్న శిల్పా కుటుంబంపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగుతోందని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గతంలో కేవలం నిర్వహణ ఖర్చులకే అందుబాటులో ఉన్న కళ్యాణ మండపాన్ని, ఇప్పుడు సామాన్యుడు అందుకోలేనంత ఖరీదుగా మార్చడంపై నంద్యాల ప్రజలు మండిపడుతున్నారు.
నంద్యాలలో పేదల అభ్యున్నతి, సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు పాటుపడే ఏకైక పేరు 'శిల్పా కుటుంబం'. మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి స్థాపించిన 'శిల్పా సేవా సమితి' ద్వారా గత కొన్నేళ్లుగా ఎన్నో సామాజిక మార్పు కార్యక్రమాలు సాగుతున్నాయి. ఇందులో భాగంగానే, పేద ప్రజలు భారీ ఖర్చులతో వివాహాలు చేసుకోలేక ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో డాక్టర్ వైఎస్సార్ కళ్యాణ మండపాన్ని శిల్పా మోహన్ రెడ్డి తన స్వంత నిధులతో నిర్మించారు.
గతంలో ఈ కళ్యాణ మండపంలో శుభకార్యాలు జరుపుకునే వారు.. కేవలం శుభ్రత, సిబ్బంది నిర్వహణ ఖర్చుల నిమిత్తం 7 వేల నుండి 10 వేల రూపాయల లోపే చెల్లించేవారు. అత్యంత తక్కువ ఖర్చుతో ఎంతో వైభవంగా ఇక్కడ పేదల పెళ్లిళ్లు జరిగేవి. అయితే, 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎంతోకాలంగా పేదలకు అండగా ఉన్న ఈ వైఎస్సార్ కళ్యాణ మండపంలో ఇప్పుడు శుభకార్యం జరుపుకోవాలంటే ఏకంగా లక్షా యాభై వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భారీ పెంపు నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇక్కడ పెళ్లిళ్లు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. తక్కువ ఖర్చుతో కార్యం ముగించుకుందామనుకునే పేదల కడుపు కొట్టారంటూ నంద్యాల నియోజకవర్గ ప్రజలు బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాను సంపాదించిన దాంట్లో 10 శాతం నిధులను నేరుగా పేద మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయిస్తూ వస్తున్న మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి సేవా కార్యక్రమాలపై కూటమి ప్రభుత్వం ఎందుకు ఇంత కక్ష కట్టిందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. శిల్పా కుటుంబంపై ఉన్న రాజకీయ విద్వేషంతో పేదలకు అందే సేవలను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని నంద్యాల వాసులు నిలదీస్తున్నారు. పేదలకు మంచి చేస్తే ఇలాంటి కక్షసాధింపులే ఎదురవుతాయా అంటూ స్థానికంగా తీవ్ర చర్చ నడుస్తోంది.







# గ్రామీణ యువత స్వయం ఉపాధికి కొత్త దిశగా కేంద్రం ప్రారంభం.

**..నైపుణ్యాభివృద్ధితో స్వావలంబన లక్ష్యం - ఆర్ఎస్ఈఎస్‌టీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.**

**..యువత, మహిళలకు ఉపాధి అవకాశాల కల్పనలో ఆర్ఎస్ఈఎస్‌టీఐ కీలక వేదిక.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 17:**
గ్రామీణ నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ఆర్ ఎస్ సి టి ఐ కీలక పాత్ర పోషిస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని క్రాంతినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఎస్ఈఎస్‌టీ ఐ శిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజకుమారి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కర్నూల్ రీజినల్ హెడ్ డి. అనిల్ కుమార్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని శిక్షణా సదుపాయాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ –ఆర్ఎస్ఈటిఐ లో గ్రామీణ నిరుద్యోగ యువత శిక్షణ పొంది పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి" అని పిలుపునిచ్చారు. "ప్రభుత్వ పథకాలు, బ్యాంకుల సహకారంతో గ్రామీణ నిరుద్యోగ సమస్యను పరిష్కరించే దిశగా ఆర్ఎస్ఈటిఐ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించడం ద్వారా యువతను స్వయం ఉపాధి వైపు మళ్లించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చేయడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకుల ఆర్థిక సహకారం మరియు నైపుణ్యాభివృద్ధి శిక్షణలను సమన్వయం చేస్తూ గ్రామీణ నిరుద్యోగ సమస్యకు పరిష్కార మార్గాలను చూపడంలో ఆర్ఎస్ఈఎస్‌టీఐ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని అన్నారు. శిక్షణ పొందిన యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయంగా పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని సూచించారు. నంద్యాల పార్లమెంట్ సభ్యులు డా. బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఆర్ఎస్ సి టి ఐ ద్వారా గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి, బ్యాంకు రుణ సహాయంతో స్వయం ఉపాధి కల్పించడం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ ఆర్ ఎస్ సి టి ఐ సంస్థ ద్వారా మరింత మంది యువతకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయి" అని అన్నారు. గ్రామీణ యువతకు ఉచితంగా వృత్తి, నైపుణ్య శిక్షణ అందించి, అనంతరం బ్యాంకుల రుణ సహాయంతో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ఆర్ఎస్ఈఎస్‌టీఐ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా జిల్లాలో మరింత మంది యువత, మహిళలు ఆర్థికంగా బలోపేతమై తమ కుటుంబాల అభివృద్ధికి తోడ్పడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ డి. అనిల్ కుమార్ మాట్లాడుతూ, "సమాజంలోని బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధి కోసం యూనియన్ బ్యాంక్ కట్టుబడి ఉందన్నారు. నంద్యాల ఆర్ ఎస్ సి టి ఐ ద్వారా రైతులు, మహిళలు, ఎస్ హెచ్ జి సభ్యులకు నైపుణ్య శిక్షణ అందించి వారిని ఆర్థికంగా స్వావలంబన చేస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ సి టి ఐ డైరెక్టర్, బి అరుణకుమారి, శిక్షకులు, సిబ్బంది, శిక్షణార్థులు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు






# టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి.

**..దూదేకొండ లో నిర్మాణ దశలో ఉన్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు/జూన్ : 17**
టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను వేగవంతం చేసి రెండు నెలల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు.బుధవారం పత్తికొండ మండలం దూదేకొండ గ్రామ సమీపంలోని కనకదిన్నె ప్రాంతంలో నిర్మాణ దశలో ఉన్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. యూనిట్‌లో కొనసాగుతున్న సివిల్ పనులు, యంత్రాల ఏర్పాట్లు, మౌలిక వసతుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు పంటలకు విలువ ఆధారిత ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో గత ఏడాది ఈ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. యూనిట్‌కు సంబంధించిన ప్రాథమిక, ద్వితీయ ప్రాసెసింగ్ విభాగాల సివిల్ పనులు పూర్తయ్యాయని, యంత్రాల కొనుగోలు కోసం ఇప్పటికే వర్క్ ఆర్డర్లు జారీ చేసినట్లు వెల్లడించారు. మరో రెండు నెలల్లో యంత్రాల ఏర్పాటు పూర్తయ్యి ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్‌లో ప్రధానంగా టమోటా కెచప్, టమోటా పల్ప్, టమోటా సాస్ తయారీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. టమోటా సీజన్ ముగిసిన అనంతరం మామిడి, అరటి, జామ వంటి పండ్ల ప్రాసెసింగ్‌కు అనుగుణంగా యూనిట్‌ను పని చేస్తుందని తెలిపారు. టమోటా ధరలు పడిపోవడం వల్ల రైతులు నష్టపోయే పరిస్థితులు తరచూ ఎదురవుతున్నాయని, అలాంటి సందర్భాల్లో రైతుల నుంచి టమోటాలను కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేయడం ద్వారా వారికి గిట్టుబాటు ధర లభించేలా ఈ యూనిట్ కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రాసెసింగ్ అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాంత రైతులు ఆయా రకాల సాగుపై దృష్టి సారిస్తున్నారని చెప్పారు. యూనిట్‌లో గంటకు 6 టన్నుల టమోటా పల్ప్ ఉత్పత్తి సామర్థ్యం ఉండగా, రోజుకు సుమారు 3 మెట్రిక్ టన్నుల కెచప్ తయారు చేయగల సామర్థ్యం ఉంటుందని వివరించారు. నెలకు సుమారు 1,200 మెట్రిక్ టన్నుల టమోటాలను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఈ కేంద్రం పనిచేయనుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా టమోటా రైతులకు మార్కెట్ ఒడిదుడుకుల నుంచి రక్షణ కల్పించడంతో పాటు విలువ ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంపొందించడం సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసి యూనిట్‌ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీవో ఓబులేసు, తహసీల్దార్ రామేశ్వర రెడ్డి, ఏపీఎంఐపీడీ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా జైలు నందు న్యాయ అవగాహన సదస్సు.





**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ జూన్ 17:** 17వ తేదీ మంగళవారం నాడు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి / జిల్లా న్యాయ సేవాది కార సంస్థ అధ్యక్షులు జి. కబర్ధి మరియు బి. లీలా వెంకట శేషాద్రి , కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాది కార సంస్థ, కర్నూల్ వారు జిల్లా కారాగారము నందు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి జైలు నందు ఏర్పాటు చేసిన ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను మరియు ములాఖత్ హెల్ప్ డెస్క్ ను తనిఖీ చేసి "జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్ మరియు ములాఖత్ హెల్ప్ డెస్క్ " గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలు వారి కున్న హక్కుల ను తెలుసు కోవాలని తెలిపారు.ఖైధి లకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ళు వయస్సు పై బడిన ఖైధిలకు, అనారోగ్యంతో బాధ పడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తా మని త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఖైధి లకు అందించే ఆహారాన్ని,రేషన్ ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైధి లను కోర్ట్ వాయిదా లకు కచ్చితంగా హాజరు చెయ్యాలని ఆదేశించారు.ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు వారిని సంప్రదించవచ్చును అన్నారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, లీగల్ ఎయిడ్ న్యాయవాదులు శివరాం మరియు సులోచన, హెల్ప్ డెస్క్ న్యాయ వాది ప్రవీణ్ కుమార్, ప్యారా లీగల్ వాలెంటీర్స్ హేమంత్, ఓం ప్రకాష్, శివాని,ఖైదీలు పాల్గొన్నారు.

# యూరియాతో పాటు లింక్ ఎరువులను కొనుగోలు చేయాలని బలవంతపెడితే కఠిన చర్యలు తప్పవు.

**..రైతులకు అవసరమైన ఎరువులు మాత్రమే విక్రయించాలి.**

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 17:**
రైతులకు యూరియాతో పాటు లింక్ పెడుతూ ఇతర ఎరువులను బలవంతంగా కొనుగోలు చేయాలని ఒత్తిడి తేవడం, లింక్ సేల్స్‌కు పాల్పడడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి షాప్ డీలర్ ను ఆదేశించారు. బుధవారం దేవనకొండ మండల కేంద్రంలోని మన గ్రోమోర్ యూరియా షాపు ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తమ పంట అవసరాలకు అవసరమైన ఎరువులను మాత్రమే కొనుగోలు చేయాలని, యూరియా కొనుగోలుకు లింక్ ఎరువుల కొనుగోలు తప్పనిసరి కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. యూరియాతో పాటు ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రోత్సహించినా, బలవంతపరిచినా సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని సాధ్యమైనంత మేర తగ్గించి, ప్రకృతి వ్యవసాయం మరియు స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా యూరియా లేదా ఇతర ఎరువుల విక్రయాల్లో లింక్ సేల్స్, అదనపు కొనుగోళ్లకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నట్లయితే 155251 మరియు 8341302863 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ రైతులకు సూచించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పించడంలో విఫలం అయిన బండగట్టు, కొంకనూరు ఆర్ ఎస్ కే సిబ్బంది మీద తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.
ఏపీఐఎంఎస్ యాప్ ద్వారా రైతుల వివరాలను ఏ విధంగా నమోదు చేస్తున్నారని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ విత్తన షాపు డీలర్లను ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఏపీఎంఐపి పిడి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# శిథిలావస్థకు చేరిన 3 ఓవర్ హెడ్ ట్యాంక్ ల కూల్చివేత.

**..ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జేఆర్ ఆదేశాల మేరకు కూల్చివేసిన అర్డబ్ల్యూ ఎస్ అధికారులు.**

**..అదే ప్రాంతంలో నూతన ట్యాంక్ నిర్మాణం చేపడతాం. -ఆర్ డబ్ల్యు ఎస్ అధికారి.**



**ఆంధ్ర ప్రగతి బేతంచెర్ల జూన్ 17:** బనగానపల్లి మండల పరిధిలోని బనగానపల్లె పట్టణంలోని స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్,టంగుటూరు,కొత్తపేట ప్రాంతాల్లో తాగునీటి అవసరాల కోసం ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉండటంతో సంబంధిత ఆర్ డబ్ల్యు ఎస్ శాఖ అధికారులు బుధవారం వాటిని కూల్చివేశారు. నిరుపయోగంగా ఉన్న ఓ హెచ్ ఆర్ ట్యాంకులను గుర్తించి కూల్చివేతకు ప్రతిపాదనలు పంపగా ఆయా ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మధ్యాహ్నం ఆయా ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న ట్యాంక్ పిల్లర్లకు బ్లాస్టింగ్ సామగ్రి అమర్చి కూల్చి వేశారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో సుమారు 50 ఏళ్ల క్రితం 40 వేల లీటర్ల సామర్థ్యం గల ఒహెచ్ ఆర్ ట్యాంకు గత 20 ఏళ్లుగా నిరుపయోగంగా ఉండి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని అవి అకస్మాత్తుగా కూలి పరిసరప్రాంతాల్లోని జనావాసానికి భారీ నష్టం వాటిల్లుతుందని భావించి మంత్రి ఆదేశాల మేరకు బ్లాస్టింగ్ సామాగ్రితో కూల్చి వేశామని అన్నారు. అవసరాన్ని బట్టి ఆయా చోట్ల మరో నూతన ఓ హెచ్ ఆర్ ట్యాంక్ నిర్మాణాలు చేపడతామని వారన్నారు.

# జూన్ 21 యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం.!

**..జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**..యోగాభ్యాసంతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత సాధ్యం.**

**..జిల్లాలో 3.50 లక్షల మంది నమోదు.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 17:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమం ద్వారా ఆరోగ్యవంతమైన, ఆనందకరమైన సమాజ నిర్మాణానికి బలమైన పునాది పడుతోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం ఉదయం నంద్యాల ఇండోర్ స్టేడియం ఆవరణలో యోగాంధ్ర అసోసియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా సాధన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శ్రీ సూరజ్ ధనుంజయ్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం యోగా నిపుణుల సూచనల మేరకు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యాన సాధన నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగాభ్యాసం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందడంతో పాటు ఒత్తిడి తగ్గుతుందని వివరించారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడులు, జీవనశైలి సంబంధిత అనారోగ్య సమస్యలకు యోగం సమర్థవంతమైన పరిష్కారంగా నిలుస్తోందన్నారు. శరీరం, మనసు, ఆత్మల సమన్వయమే యోగమని, ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ యోగాభ్యాసం చేయడం వల్ల వ్యక్తిగత జీవితం, వృత్తిపరమైన జీవితం మధ్య సమతుల్యత సాధించవచ్చని తెలిపారు.
రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని గ్రామ స్థాయి వరకు విస్తరించి ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇప్పటివరకు జిల్లాలో 3.50 లక్షల మంది 'యోగాంధ్ర' యాప్, పోర్టల్ ద్వారా స్వచ్ఛందంగా నమోదు చేసుకోవడం హర్షణీయమని అన్నారు. జూన్ 21న జిల్లాలోని ప్రతి గ్రామం, వార్డు, మండల కేంద్రం, నియోజకవర్గ కేంద్రం, జిల్లా కేంద్రంలో భారీ స్థాయిలో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల లక్ష్యమని పేర్కొంటూ, ఆసక్తి కలిగిన ప్రజలందరూ తమ పేర్లు నమోదు చేసుకుని యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
జిల్లాలోని అన్ని యోగా సంస్థలు యోగాంధ్ర కార్యక్రమంలో చురుకుగా భాగస్వామ్యం కావడం అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు. కార్యక్రమ విజయవంతానికి సహకరిస్తున్న యోగా గురువులు, యోగా అసోసియేషన్లు, ఆయుష్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, క్రీడాశాఖ అధికారులు, నోడల్ అధికారి డాక్టర్ యశోధరతో పాటు సంబంధిత శాఖలందరికీ కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా సాధకులు, విద్యార్థులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యల పాల్గొన్నారు.

# “రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం” కార్యక్రమం ఘన విజయవంతం.

**..ప్రతి అర్హత కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా చర్యలు.**

**..ప్రజలకు చేరువైన సంక్షేమం.. వేగవంతమైన అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం.**

**..రాష్ట్ర అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం**

**: మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి.**

**..'టీమ్ ఎఫర్ట్'తో జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా తీర్చిదిద్దుదాం**

**- జిల్లా కలెక్టర్ జి రాజకుమారి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 17:**
ప్రతి అర్హత కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మరియు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డిలు అన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డు ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న “రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం“ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, పాణ్యం, ఆత్మకూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు,జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ఎస్పీ సునీల్ షోరాన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. జిల్లా పరిపాలన యంత్రాంగం సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అధికారులు అందుబాటులో ఉండి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన అన్ని శాఖల అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు. రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మరియు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. యువత ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు చేపట్టడంతో పాటు విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పిస్తూ కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఆర్ అండ్ బి శాఖ ద్వారా విస్తృత స్థాయిలో రోడ్ల మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గుంతలు లేని రహదారుల లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, నంద్యాల జిల్లా ఆర్థికాభివృద్ధికి వ్యవసాయం, అనుబంధ రంగాలే ప్రధాన ఆధారమని, జిల్లా స్థూల ఆర్థికోత్పత్తి (జీడీపీ)లో దాదాపు 45 శాతం వాటా ఈ రంగాల నుంచే లభిస్తోందని తెలిపారు. గత రెండేళ్లలో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా 2.06 లక్షల మంది రైతులకు సుమారు రూ.400 కోట్ల ఆర్థిక సహాయం అందిందన్నారు. విత్తనాలు, ఎరువులు, ఇతర సబ్సిడీల రూపంలో వ్యవసాయ రంగానికి రూ.430 కోట్ల మద్దతు లభించిందని చెప్పారు. హార్టికల్చర్ అభివృద్ధికి 21 వేల హెక్టార్లలో రూ.156 కోట్ల వ్యయంతో కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. మైక్రో ఇరిగేషన్ కింద 8,816 మంది రైతులకు రూ.71 కోట్ల సబ్సిడీ అందించగా, పశుసంవర్ధక, మత్స్యశాఖల ద్వారా కూడా రైతులకు గణనీయమైన ప్రోత్సాహం లభించిందన్నారు. మొత్తంగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు గత రెండేళ్లలో రూ.600 కోట్లకు పైగా మద్దతు అందిందని కలెక్టర్ తెలిపారు తెలిపారు.
ముఖ్యమంత్రి ఆశయమైన “వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్” లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో 1,984 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించబడి రూ.58 కోట్ల పెట్టుబడులు ఆకర్షించాయని వివరించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నియోజకవర్గాల వారీగా నిర్వహిస్తున్న జాబ్ మేళాలకు విశేష స్పందన లభిస్తోందని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సామాజిక భద్రతా పథకాల అమలులోనూ జిల్లా ముందంజలో ఉందని కలెక్టర్ తెలిపారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ సదుపాయాలు, ఆటో డ్రైవర్లకు భరోసా పథకం, మహిళలకు స్త్రీ శక్తి కార్యక్రమం, దివ్యాంగులకు దివ్యాంగుల శక్తి వంటి పథకాల ద్వారా వేలాది మంది లబ్ధి పొందుతున్నారని చెప్పారు. “తల్లికి వందనం” పథకం ద్వారా 2.59 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.308 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థి మిత్ర కిట్లు వంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా గత రెండేళ్లలో 58 వేల మందికి పైగా రోగులకు రూ.123 కోట్లకు పైగా వైద్య సహాయం అందిందని కలెక్టర్ వివరించారు. ఆర్ అండ్ బి శాఖ ద్వారా రూ.313 కోట్లతో 306 రహదారి పనులు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా వందలాది గ్రామీణ రహదారి పనులు, జాతీయ రహదారుల అభివృద్ధి, తాగునీటి పథకాలు, నీటి వనరుల అభివృద్ధి, మున్సిపల్ మౌలిక వసతుల పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. జల సంరక్షణకు జలహారతి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ప్రతి నెలా 2.15 లక్షల మందికి పెన్షన్లు అందజేస్తున్నామని, ఇందుకోసం నెలకు రూ.100 కోట్లు, సంవత్సరానికి రూ.1,200 కోట్లు, రెండేళ్లలో రూ.2,400 కోట్లు ఖర్చు చేస్తున్నా మని వివరించారు. అదేవిధంగా బీమా పథకాల ద్వారా 14.85 లక్షల మందికి పైగా లబ్ధి చేకూరగా, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.118 కోట్లు వ్యయం చేశాయని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద రూ.60 కోట్లతో 2,103 పనులు చేపట్టినట్లు, డీఎంఎఫ్ నిధులతో ప్రతి నియోజకవర్గంలో క్యాస్కేడ్ నిర్మాణం, సుందరీకరణ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేస్తేనే నంద్యాల జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లగలమని కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ మాట్లాడుతూ, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే, పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామని తెలిపారు. సాంకేతికత వినియోగంలో భాగంగా డ్రోన్ పెట్రోలింగ్, సీసీటీవీ-360 వెబ్ ప్లాట్‌ఫామ్ ద్వారా నేరాల నియంత్రణ, నేరస్థుల గుర్తింపులో విశేష ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే 70 శాతానికి పైగా ఆస్తి దొంగతన కేసులను ఛేదించి, 85 శాతం ఆస్తులను రికవరీ చేసినట్లు వెల్లడించారు. గంజాయి నియంత్రణలో నంద్యాల జిల్లా రాష్ట్రంలోనే అత్యల్ప వినియోగం కలిగిన జిల్లాల్లో ఒకటిగా నిలిచిందని, మహిళల భద్రత కోసం 'ఆపరేషన్ దండాయం' ద్వారా కేసులను వేగంగా విచారించి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి గత మూడు నెలల్లో 1,500 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడంతో పాటు మద్యం సేవించి భారీ వాహనాలు నడిపిన 17 మంది డ్రైవర్లను జైలుకు పంపినట్లు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు నిర్భయంగా 112 సేవలను వినియోగించుకోవాలని, సమాచారం అందిన 10 నిమిషాల్లోపు పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని స్పందించేలా వ్యవస్థను బలోపేతం చేసినట్లు ఎస్పీ తెలిపారు. నంద్యాల పార్లమెంటు సభ్యులు బైరెడ్డి శబరి మాట్లాడుతూ, గత రెండేళ్లలో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించడం, రైల్వేలు, రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. రైతులకు సాగునీరు, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తూ వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న పెన్షన్లు, తల్లి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరుతున్నాయని, అందుకే ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రగతికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకువస్తున్నామని తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, తుంగభద్ర జలాల విషయంలో సీఎం జోక్యంతో కేసీ కాలువకు నీటి విడుదల సాధ్యమైందని తెలిపారు. అలాగే గోరకల్లు రిజర్వాయర్ మరమ్మతులు, ఇతర సాగునీటి ప్రాజెక్టులకు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి పనులు చేపట్టినట్లు వివరించారు.
ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి గ్రీవెన్స్ కార్యక్రమాలు నిర్వహించడం, గ్రామాల స్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకోవడం, పెన్షన్ల పంపిణీలో ప్రజల ఇళ్లకు వెళ్లడం వంటి చర్యల ద్వారా పారదర్శక పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.
నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నాయకత్వంలో సామాజిక పెన్షన్లను రూ.4,000కు పెంచడంతో పాటు వికలాంగులు, డయాలసిస్ రోగులు, మంచానికే పరిమితమైన వారికి అధిక ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి భారీ కేటాయింపులు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే నీటి కొరత ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విజయవంతమైందన్నారు.
అంతకుముందు 19 ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన అభివృద్ధి, సంక్షేమ ప్రదర్శన స్టాళ్లను మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

















EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# నేరేడు పండ్లు మనల్ని ఏమి హెచ్చరిస్తున్నాయి..?




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 17:** ఈ ఏడాది మార్కెట్లలో నేను గత ముప్పై సంవత్సరాల్లో ఎప్పుడూ చూడనంతగా నేరేడు పండ్లు కనిపిస్తున్నాయి.

చెట్ల నుంచి పండ్లు అక్షరాలా కురుస్తున్నాయి. గత సంవత్సరం కొద్దిపాటి పండ్లు మాత్రమే కాసిన చెట్లు కూడా ఈసారి విపరీతంగా పండ్లు కాస్తున్నాయి. ఇప్పటికే ఎక్కువ పండ్లు కాసే చెట్లు అయితే మరింత భారీగా పండ్లను రాలుస్తున్నాయి.

## అసలు ఇలా ఎందుకు జరుగుతోంది?

**మా అమ్మమ్మ ఒక మాట చెప్పేది:**

"వేసవిలో నేరేడు చెట్లు ఇంతగా పండ్లు రాలిస్తే, ఆ సంవత్సరం కరువు వచ్చే అవకాశాలు ఎక్కువ."

ఆశ్చర్యకరంగా, శాస్త్రం కూడా ఈ సంప్రదాయ జ్ఞానాన్ని చాలావరకు సమర్థిస్తుంది. వృక్ష శాస్త్రంలో ఈ పరిస్థితిని "మాస్టింగ్ లేదా "స్ట్రెస్ ఫ్రూటింగ్ అంటారు. అంటే, చెట్టు తన మనుగడకన్నా ఎక్కువగా పండ్లు, విత్తనాలు ఉత్పత్తి చేయడంపై దృష్టి పెట్టే పరిస్థితి. దీనిని కొందరు "సూసైడ్ ఫ్రూటింగ్" లేదా "బంపర్ క్రాప్" అని కూడా పిలుస్తారు.

**1.జాతి మనుగడ కోసం ప్రకృతి ప్రయత్నం**

చెట్టు భూగర్భ జలాలు తగ్గుతున్నాయని లేదా వాతావరణంలో పెద్ద మార్పులు రాబోతున్నాయని గుర్తించినప్పుడు, అది ఒక రక్షణ చర్యలోకి వెళు తుంది.

"నేను భవిష్యత్తులో బతకలేకపోవచ్చు" అని చెట్టు భావించినట్లుగా, తన శక్తినంతా విత్తనాలు (పండ్లు) ఉత్పత్తి చేయడంలో పెట్టుబడి పెడుతుంది. తద్వారా తన జాతి కొనసాగుతుందని ప్రకృతి నిర్ధారిస్తుంది.

**2.కొత్త పెరుగుదలను తగ్గించడం.**

ఇలాంటి సంవత్సరాల్లో చెట్లు కొత్త కొమ్మలు, చిగుర్లు తక్కువగా వేయవచ్చు లేదా పూర్తిగా ఆపేయవచ్చు.

ఎందుకంటే కొత్త ఆకులు, కొమ్మలు పెరగడానికి ఎక్కువ నీరు, పోషకాలు అవసరం. అందుకే చెట్టు తన శక్తిని ఆదా చేసి, ఎక్కువ పండ్లు కాయించడంపైనే దృష్టి పెడుతుంది.

దీని వల్లే గత సంవత్సరం తక్కువ పండ్లు కాసిన చెట్లు కూడా ఈసారి పండ్లతో నిండిపోతాయి.

**3.అమ్మమ్మ మాట వెనుక ఉన్న శాస్త్రం.**

అమ్మమ్మల పరిశీలనలు చాలాసార్లు ప్రకృతిని దగ్గరగా గమనించడం వల్ల వచ్చినవే.

నేరేడు చెట్టుకు చాలా లోతుగా వెళ్లే వేర్లు ఉంటాయి. భూగర్భ జలమట్టం బాగా తగ్గినప్పుడే ఆ వేర్లకు నీటి కొరత అనిపిస్తుంది.

ఈ నీటి ఒత్తిడి చెట్టుకు ఒక హెచ్చరిక సంకేతంగా పనిచేస్తుంది.

అందువల్ల వేసవిలో నేరేడు చెట్లు అసాధారణంగా ఎక్కువ పండ్లు కాయించి రాలిస్తే, అది రాబోయే ఎండలు లేదా నీటి కొరతకు ప్రకృతి ఇచ్చే సూచన కావచ్చు. నేరేడు చెట్టు ఆత్మహత్య చేసుకోవడం లేదు. తన తరువాతి తరాలు బతికేలా విత్తనాల రూపంలో ఎక్కువ సంతానాన్ని సృష్టించేందుకు చివరి వరకు ప్రయత్నిస్తోంది.

ప్రకృతి చక్రం నిజంగా అద్భుతమైనది. మన పెద్దలు తరతరాలుగా గమనించి చెప్పిన విషయాలు, ఆధునిక శాస్త్రం చెప్పే విషయాలతో చాలాసార్లు సరిపోతుంటాయి.

కాబట్టి ఈ ఏడాది నేరేడు పండ్ల సమృద్ధిని ఆనందించండి. కానీ ప్రకృతి ఇస్తున్న ఈ హెచ్చరికను కూడా గమనించండి.

నీటిని పొదుపుగా వాడండి. ప్రకృతి వనరులను బాధ్యతగా వినియోగించండి. అదే భవిష్యత్ తరాలకు మనం ఇవ్వగలిగే గొప్ప బ హుమతి.

# గ్యాస్ వినియోగదారులకు మెలిక

## 30లోగా కెవైసీ, బయోమెట్రిక్ చేసుకోవాలి

**న్యూఢిల్లీ,జూన్ 17 ఆంధ్ర ప్రగతి**

వంటగ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉజ్వల పథకం లబ్ధిదారులతో పాటు సబ్సిడీ పొందుతున్న సాధారణ గ్యాస్ వినియోగదారులు కూడా జూన్ 30 లోగా తమ బయోమెట్రిక్ పక్రియను కచ్చితంగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈ గడువులోగా బయోమెట్రిక్ పూర్తి చేయని వారి ఖాతాల్లో సబ్సిడీ జమ కాకుండా నిలిపివేయనున్నారు. ఏడాదిగా ఈ-కేవైసీ పక్రియ కొనసాగుతున్నా ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ నెల 30లోపు పూర్తి చేయాలని కేంద్రం నిర్దేశించింది. ఒకవేళ జూన్ 30 గడువు దాటిన తర్వాత బయోమెట్రిక్ పూర్తి చేసుకుంటే.. ఆ తేదీ

తర్వాత తీసుకునే సిలిండర్లకు మాత్రమే సబ్సిడీ లభిస్తుంది. గడువు ముగిసిన రోజు నుంచి బయోమెట్రిక్ పూర్తయ్యే మధ్య కాలంలో తీసుకునే సిలిండర్లపై సబ్సిడీని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని కేంద్రం తన సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మే 18న జారీ చేసిన ప్రకటన ప్రకారం.. బయోమెట్రిక్ పక్రియ పూర్తి కాలేదనే నెపంతో వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ల సరఫరాను మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ నిలిపివేయకూడదు. అయితే, క్షేత్రస్థాయిలో అందుతున్న సమాచారం ప్రకారం.. బయోమెట్రిక్ పూర్తి చేయని వారికి సిలిండర్ల



డెలివరీని ఆలస్యం చేయాలని లేదా నిలిపివేయాలని ఆయిల్ కంపెనీల నుంచి గ్యాస్ డీలర్లకు అనధికారిక ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడంతో, ఇటీవల జూన్ 7న సిలిండర్ ధరను రూ.29 మేర పెంచారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సబ్సిడీ లేని గృహోపయోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.994 పలుకుతోంది. కేంద్రం ఉజ్వల పథకం కింద ప్రతి సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ ఇస్తుండగా, మిగిలిన అర్హులైన సాధారణ వినియోగదారుల బ్యాంక్ ఖాతాల్లో స్వల్ప మొత్తంలో సబ్సిడీ జమ అవుతోంది. మరోవైపు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. రాష్ట్రంలో సుమారు 1.26 లక్షలకు పైగా క్రియాశీలక గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఇండియన్ ఆయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కంపెనీలు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోని వారి వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో కూడా పంచుకోనున్నాయి. గ్యాస్ కనెక్షన్ తీసుకున్నప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయని వారు వెంటనే తమ పరిధిలోని గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి ఈ పక్రియను పూర్తి చేసుకోవాలి. జూన్ 30 లోగా ఈ పని పూర్తి చేసుకుంటేనే ఎలాంటి అంతరాయం లేకుండా సబ్సిడీ డబ్బులు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయి.

గ్యాస్ కనెక్షన్లను ఆధార్‌తో అనుసంధానం చేయడంతో పాటు ముఖ గుర్తింపు, వేలిముద్రలు లేదా ఐరిస్ వంటి మూడు విధానాలతో ఎల్‌పీజీ వినియోగదారుల ఈ-కేవైసీని పూర్తి చేయనున్నారు. ఈ పక్రియ కోసం వినియోగదారులే నేరుగా ఆయిల్ కంపెనీల మొబైల్ యాప్ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చు. గ్యాస్ ఏజెన్సీల డీలర్ల వద్ద ఈ-కేవైసీ పూర్తి చేసేందుకు కూడా అవకాశం కల్పించారు. కొన్ని గ్యాస్ ఏజెన్సీలు గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలోనే ఈ పక్రియను పూర్తి చేస్తున్నాయి.

----------------

# నేటినుంచి శుభముహూర్తాలు

### మోగనున్న పెళ్లి బాజాలు

### పశ్చిమాసియా యుద్ధంతో పెరిగిన ఖర్చులు

**విజయవాడ,జూన్ 17 (గుడివాడ మెయిల్):**

తెలుగు లోగిళ్లల్లో పెళ్లి బాజాల సందడి మొదలైంది. గత నెలన్నర రోజులుగా అధిక జ్యేష్ఠ మాసాల వల్ల ఆగిపోయిన శుభకార్యాల హడావుడి ఇప్పుడిప్పుడే ఊపందు కుంటోంది. జూన్ 15 నుంచి నిజ జ్యేష్ఠ మాసం ప్రవేశించడంతో పెళ్లిళ్ల హడావుడి షురూ అయ్యింది. జూన్ 18 నుంచి జులై 9 వరకు మాత్రమే పరిమితంగా శుభ ముహూర్తాలు ఉన్నాయి. ఆ తర్వాత మళ్లీ జులై 15 నుంచి ఆషాఢమాసం, గురుమూఢం మొదలై ఆగస్టు 15 వరకు బ్రేక్ పడనుంది. తిరిగి శ్రావణ మాసం వస్తేనే గానీ మళ్లీ శుభకార్యాలు జరగవు. ఈ కాస్త గ్యాప్‌లోనే పెళ్లిళ్లు కానిచ్చేయాలని అందరూ ఒకేసారి ప్రయత్నిస్తుండటంతో మార్కెట్లో విపరీతమైన పోటీ ఏర్పడింది. సమయం తక్కువగా ఉండటాన్ని ఆసరాగా చేసుకుని పురోహితులు, ఫంక్షన్ హాళ్ల యజమానులు, డెకరేటర్లు అందరూ




డిమాండ్‌ను బట్టి రేట్లు పెంచేస్తున్నారు. అయితే, ఈ సంతోషాల వెనుక పెళ్లి పెద్దలకు ఒక పెద్ద బ్జడెట్ సవాల్ ఎదురవుతోంది. ప్రస్తుతం చేతిలో ఉన్న సమయం చాలా తక్కువగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. మరోవైపు అంతర్జాతీయంగా అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం తెలుగు లోగిళ్ల పెళ్లిళ్లపై గట్టిగానే పడుతోంది. యుద్ధ వాతావరణం వల్ల పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు, వాహనాల కిరాయిలు భారీగా పెరిగాయి. అలాగే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరల పెరుగుదలను సాకుగా చూపిస్తూ క్యాటరింగ్ నిర్వాహకులు ప్లేటు ధరలను పెంచేశారు. సమాజంలో హోదా కోసం కనీసం పాతిక రకాల వంటకాలతో విందు వడ్డించడం రివాజుగా మారడంతో, ఇప్పుడు ప్లేటు ధర కనీసం రూ.500 దాటుతోంది. వీటన్నింటికీ మించి మధ్యతరగతి, పేద కుటుంబాలకు పెళ్లిలో అత్యంత కీలకమైన బంగారం కొనుగోలు భారంగా మారింది. సాంప్రదాయం ప్రకారం మంగళసూత్రాలు, గొలుసు, కమ్మలు, గాజులు వంటి కనీస అవసరాల కోసమే 5-6 తులాలు కొనాల్సి వస్తోంది. ఏడాది క్రితంతో పోలిస్తే పసిడి ధరలు విపరీతంగా పెరగడం వల్ల, కేవలం బంగారం కొనుగోలుకే ఇప్పుడు రూ.7-8 లక్షలు అవుతోంది. ఇక బంగారం ఖర్చు కాకుండా? మండపం అ÷-దదె, డెకరేషన్, విందు భోజనాలు, ప్రయాణాలకే అదనంగా మరో రూ.5 నుంచి 10 లక్షలు ఖర్చవుతోంది. అంతర్జాతీయ పరిస్థితుల ముందటి కాలంతో పోలిస్తే, ప్రస్తుతం ఒక్కో పెళ్లికి సగటున రూ.5 లక్షల వరకు అదనపు భారం పడుతోంది. మొత్తానికి, పెళ్లి బాజాలు మోగుతున్నా.. ఖర్చుల మోత చూసి వధూవరుల తల్లిదండ్రులు మాత్రం తలలు పట్టుకుంటున్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో మళ్లీ పెరిగిన ఉష్ణోగ్రతలు

### నైతురు ప్రవేశించినా కురియని చినుకులు

### మరో వారంపాటు ఇదే పరిస్థితి ఉంటుందన్న ఐఎండి

**న్యూఢిలీజూన్ 17 ఆంధ్ర ప్రగతి**

: ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరుగు తున్నాయి. తెలంగాణలో వచ్చే నాలుగు రోజుల పాటు తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నైరుతి రుతుపవనాలు దేశంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నప్పటికీ కనీసం మరో వారం రోజులపాటు విస్తృతమైన వర్షపాతం తక్కువగానే ఉండే అవకాశం ఉంది. జూన్ 23 ప్రాంతంలో పరిస్థితులు మెరుగుపడటం ప్రారంభమయ్యే వరకు వర్షాలు అంతంత మాత్రంగానే ఉంటాయని వాతావరణ పరిస్థితులు సూచిస్తున్నాయి. భారత్‌లోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో రుతుపవనాల కదలిక సాంకేతికంగా కొనసాగుతున్నప్పటికీ వర్షాలను కురిపించే ఆ వ్యవస్థ అసాధారణంగా బలహీనంగా ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. జూన్ 15 నుంచి జూన్ 21 మధ్య రుతు పవనాల కార్యకలాపాలు పెద్దగా చురుకుగా ఉండకపోవచ్చని అంచనా. దీనివల్ల దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికే ఏర్పడిన వర్షపాత లోటు మరింత కొనసాగే అవకాశం ఉంది. రానున్న వారంలో విస్తృతమైన రుతుపవన వర్షాలకు బదులుగా ప్రధానంగా దక్షిణ భారతదేశంలో స్థానిక ఉరుములతో కూడిన వర్షాల ద్వారానే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దు ప్రాంతాలు, అలాగే తూర్పు కనుమల్లో తరచుగా ఉరుములతో కూడిన వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. దీనివల్ల అక్కడక్కడ మోస్తరు నుండి భారీ వర్షాలు, మెరుపులు, బలమైన గాలులు సంభవించే అవకాశం ఉంది. ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 9-10 రాష్ట్రాలపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని.. ఆ రాష్ట్రాల్లోని జిల్లా అధికారులు, వ్యవసాయ సంస్థలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదేశించారు. వర్షపాతం తక్కువగా ఉన్న జిల్లాల కోసం ముందస్తు అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేయటం, పత్తి, పప్పుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచటం, రైతులకు శాస్త్రీయ సలహాలు అందేలా చూడటంపై దృష్టి సారించాలని ఆయన అన్నారు. ఖరీఫ్ 2026 సన్నాహకాలపై మంగళవారం సమీక్ష సమావేశానికి కేంద్ర మంత్రి చౌహాన్ అధ్యక్షత వహించారు. వర్షపాతం తక్కువగా ఉన్న జిల్లాల్లో ముందస్తు అత్యవసర ప్రణాళికల ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

# హైదరాబాద్‌లో రోడ్డుకు ట్రంప్ పేరు సరికాదు

### ఒక నియంత పేరు పెట్టడం ఎంతవరకు సబబు

### సిఎం రేవంత్ నిర్ణయాన్ని తప్పపట్టిన సిపిఎం

**న్యూఢిల్లీజూన్ 17 ఆంధ్ర ప్రగతి**

: హైదరాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం పక్కన ఉన్న రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి తీవ్రంగా వ్యతిరేకించారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో వియత్నాంపై అమెరికా యుద్ధం ఉధృతంగా సాగుతున్న సమయంలో, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట నేత హో చి మిన్ గౌరవార్థం కోల్‌కతాలోని అమెరికా రాయబార కార్యాలయం వెలుపల ఉన్న హారింగ్టన్ వీధికి ఆయన పేరు పెట్టారని ఈ సందర్భంగా బేబి గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాలంలో అమెరికా.. ఇరాన్‌పై యుద్ధ వాతావరణాన్ని సృష్టించడం, వెనిజులాలో సైనిక జోక్యానికి పాల్పడటం, క్యూబాపై ఆంక్షలతో దౌర్జన్యం చేయడం వంటి చర్యల ద్వారా మానవాళిపై సామ్రాజ్యవాద దురాక్రమణకు ప్రతీకగా నిలుస్తోందని



ఆయన విమర్శించారు. నేటి కాలపు హిట్లర్‌లా మారాలని ఆకాంక్షిస్తున్న ట్రంప్‌ను గౌరవిస్తూ, తెలంగాణ ముఖ్యమంత్రి హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ పక్కన ఉన్న రహదారికి ఆయన పేరు పెట్టాలని నిర్ణయించడం సరికాదని దుయ్యబట్టారు. ఇటీవల అమెరికా సైన్యం ఒక నిరాయుధ వాణిజ్య నౌకపై దాడి చేసి ముగ్గురు భారతీయ నావికులను హతమార్చిందని ఆయన ఆరోపించారు. అమెరికా ప్రభుత్వం ఇటువంటి దాడులను కొనసాగిస్తామని బెదిరిస్తున్నప్పటికీ, ఈ దారుణమైన క్షిపణి దాడిపై భారత ప్రభుత్వం తగిన రీతిలో నిరసన వ్యక్తం చేయలేదని, ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ విషయంపై స్పందించడానికి నిరాకరించారని అన్నారు. దీన్నిబట్టి దేశ సార్వభౌమత్వాన్ని, ఆత్మగౌరవాన్ని వదులుకోవడానికి బిజెపికి ఎటువంటి సంకోచం లేదని స్పష్టమవుతోందని, ఇప్పుడు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. ఈ వివాదాస్పద నిర్ణయాన్ని ఉపసంహరించు కునేలా కాంగ్రెస్ అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకోవాలని తాను ఆశిస్తున్నట్లు ఎం.ఎ. బేబి పేర్కొన్నారు. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ చేసే తీర్మానాలు కేవలం మాటలకే పరిమితం కాకూడదని, ఆచరణలో చూపాలని ఆయన సూచించారు.

# డిఎస్సీపై దమ్ముంటే చర్చకు రావాలి

### ఆరోపణలు కాదు..ఆధారాలు చూపాలి

### జగన్‌కు మంత్రి లోకేశ్ సవాల్

**గుంటూరు,జూన్ 17ఆంధ్ర ప్రగతి**

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఏపీ మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. డీఎస్సీపై తాడేపల్లి ప్యాలెస్‌కు కూతవేటు దూరంలో ఉండి మరీ ఛాలెంజ్ చేశారు మంత్రి. 'జగన్ ఇంటికి 200 మీటర్ల దూరంలో నిలబడే మాట్లాడుతున్నా.. డీఎస్సీపై అనుమానాలుంటే సమాధానం చెప్పేందుకు ఇక్కడే సిద్ధంగా ఉన్నా. సవాల్ స్వీకరించే ధైర్యం ఉన్నవాళ్లు చర్చకు రావాలి. జగన్ ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీ నియామకాలు ఆపలేరు. మేం సాక్షి క్యాలెండర్ కాకుండా నిజమైన జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తున్నాం. ఒక్క డీఎస్సీ



అయినా నిర్వహించి ఉంటే హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్లు అర్థమవుతాయి' అంటూ వ్యాఖ్యానించారు. పులివెందుల ఎమ్మెల్యే.. బెంగళూరు, హైదరాబాద్ వీడి ఏపీ వైపు చూస్తే అభివృద్ధి కనిపిస్తుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ప్రిజనరీ చుట్టూ ఎప్పుడూ రౌడీలే ఉంటారని మంత్రి అన్నారు. మహిళల్ని కించపరిచే వారిని, తిట్టేవారిని తన చుట్టూ ప్రిజనరీ పెట్టుకుంటారంటూ దుయ్యబట్టారు. కోడిగుడ్డుకు పరిశ్రమకు తేడా తెలియని వాళ్లు మంత్రులుగా చేయబట్టే పరిశ్రమలు పారిపోయాయంటూ మండిపడ్డారు. గుడివాడ అమర్‌నాథ్ అద్భుతంగా మాట్లాడారని జగన్ కితాబివ్వటం దురదృష్టకరమన్నారు. భారతీరెడ్డి, తన ఇద్దరు కూతుళ్లని.. హోం మంత్రిని అవమానించినట్లు అవమానిస్తే కూడా జగన్ శభాశ్ అంటారా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీది ఆ సంస్కృతి కాదు కాబట్టే జగన్ కుటుంబసభ్యుల్ని కించపరిచిన వారిపైనా చర్యలు తీసుకున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.